RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# అన్నదాతకు అడుగడుగునా కష్టాలే..

- మొదలైన వరి కోతలు!
- కొనుగోలు కేంద్రాలు లేక కల్లాల వద్దే దళారుల కాంటాలు
- సన్నాలకు సర్కారు బోనస్ ఆశతో భారీగా సాగు చేసిన వైనం
- ఫెర్టిలైజర్ షాపుల నిర్వాహకుల దోపిడీ.. నకిలీ మందులతో నిలువునా నష్టం



**దేవరుప్పుల, అక్టోబర్ 09(పద్మక్రాంతి) :**

ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకోవడంతో మండలంలో ముందస్తుగా నాట్లు వేసిన రైతులు వరి కోతలు ప్రారంభించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు దఫదఫాలుగా నాట్లు వేశారు. దీంతో కోతలు కూడా ఒకేసారి కాకుండా క్రమంగా మొదలవుతున్నాయి. ఆలస్యంగా నాట్లు వేసిన వారు ఎండల బారినుంచి పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతుండగా, చిరుపొట్ట దశలో ఉన్న వరి పంట చేతికొస్తుందా లేదా అన్న ఆందోళనలో మరికొందరు రైతులు ఉన్నారు. ఇదే సమయంలో కోతలు పూర్తయిన చోట ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు, దళారులు నేరుగా కల్లాల వద్దకే చేరుకుని పచ్చి ధాన్యాన్ని సైతం తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం.. మొత్తం సాగులో ప్రభుత్వం ఇచ్చే బోనస్ కలిసి వస్తుందనే ఆశతో మెజార్టీ రైతులు సన్న రకాలనే సాగు చేశారు. అయితే, పంట చేతికొచ్చే సమయానికి వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో వరి పొలాలను దోమపోటు, నల్లి పురుగు తీవ్రంగా ఆశ్రయించాయి. వీటిని నివారించే క్రమంలో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోకుండా నేరుగా ఫెర్టిలైజర్ షాపులకు పరుగులు తీస్తున్నారు. లాభాపేక్షతో ఫెర్టిలైజర్ షాపుల యజమానులే వ్యవసాయ అధికారులుగా మారిపోయి, రైతులకు నాసిరకం పురుగు మందులను అంటగడుతున్నారు. దీనికితోడు ఏ ఒక్క రైతుకు రసీదు ఇవ్వకుండా ఇష్టానుసారంగా అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. నాసిరకం మందుల వల్ల తెగుళ్లు తగ్గక, అటు పెట్టుబడి పెరిగి, ఇటు దళారుల చేతిలో మద్దతు ధర రాక రైతులు ఆర్థికంగా కుంగిపోతున్నారు. కష్టపడి పండించిన పంటకు సరైన సమయంలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని, వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు వేడుకుంటున్నారు.

# చే గువేరా ఆశయాలను నేటి యువత, విద్యార్థులు పుణికిపుచ్చుకోవాలి

- ఘనంగా మహా విప్లవకారుడి వర్ధంతి కార్యక్రమం
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు




**ఆలేరు, అక్టోబర్ 9 (పద్మక్రాంతి) :**

ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల విముక్తి కోసం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప విప్లవకారుడు చే గువేరా అని, ఆయన ఆశయాలను నేటి విద్యార్థులు, యువత సాధించాలని డి వై ఎఫ్ వై పట్టణ కార్యదర్శి మొరిగాడి పృథ్వీ, ఎస్.ఎఫ్. ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ పిలుపునిచ్చారు. చే గువేరా వర్ధంతి సందర్భంగా
ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో చే గువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చే గువేరా జీవితం, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని కొనియాడారు. సమాజంలో వేరూనుకున్న అన్యాయాలు, వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధించే వరకు నిరంతరం పోరాటం కొనసాగించడమే చే గువేరాకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు వడ్డెమాను విప్లవ్, పట్టణ నాయకులు ఎక్కల్ దేవి భాస్కర్, మొరిగాడి మహావీర్, ఎస్ఎఫ్ఐ నాయకులు మామిడాల సంపత్, కర్రె విజయ్, అందె సురేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య హైస్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు







- మెరుగైన విద్యతోపాటు, మన సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందిస్తాం
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు
- - శ్రీ చైతన్య హై స్కూల్ ప్రిన్సిపల్ సామ అశోక్ రెడ్డి

**మేడిపల్లి, అక్టోబర్ 09,(పద్మక్రాంతి):**

తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు భావితరాలకు అందించేందుకు శ్రీ చైతన్య ప్రిన్సిపల్ సామ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉప్పల్ డిపో వద్ద గల శ్రీ చైతన్య హై స్కూల్, ప్రైమ్ స్కూల్, బోడుప్పల్ లోని ఒలంపియాడ్ స్కూల్ లలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ,రంగురంగుల పూలతో అందమైన, ఆకర్షణీయమైన బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సామ అశోక్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించడం మన బాధ్యతగా భావించి బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, కృష్ణాష్టమి, దీపావళి వంటి పండుగలను పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహిస్తామని, మెరుగైన విద్యతోపాటు, అత్యుత్తమ సామాజిక విలువలు, సాంప్రదాయాలను అందించడమే శ్రీ చైతన్య హై స్కూల్ లక్ష్యమని ఆయన అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి సామ అశోక్ రెడ్డి ప్రత్యేక బతుకమ్మ పండుగ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ సాయి అభిషేక్ రెడ్డి, మూడు బ్రాంచీలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధ నేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**మహబూబాబాద్, అక్టోబర్ 09 ( పద్మక్రాంతి):**

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరి మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఆమె పేర్కొన్నారు.
అనంతరం విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు, కోలాటాలతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

## - ఘనంగా పేరెంట్స్ మీటింగ్, బతుకమ్మ వేడుకలు





**మహబూబాబాద్, అక్టోబర్ 09 ( పద్మక్రాంతి):**

విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరామ్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో (బాలికలు) శుక్రవారం ప్రధానోపాధ్యాయులు బి.బాబు అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్ దేశీరామ్ నాయక్, ఏటీడీఓ ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థుల భవిష్యత్తులో తల్లిదండ్రుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు.
విద్యార్థులు చదువులో రాణించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల, తల్లిదండ్రుల మధ్య పరస్పర సహకారం ఎంతో అవసరమని, ఉపాధ్యాయులు సూచించే మార్గదర్శకాలను తల్లిదండ్రులు పాటిస్తూ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థినులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని సూచించారు.

### సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు

పేరెంట్స్ మీటింగ్ అనంతరం పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.
ఈ వేడుకలు విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు ఐకమత్యం, సామూహిక భాగస్వామ్యం వంటి విలువలను బలోపేతం చేశాయి. విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు.
ఈ కార్యక్రమంలో వార్డెన్ అనిత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి 14 ఏళ్ల బాలుడు మృతి

- క్రాంతి కాలనీ ఎస్ ఎల్ ఎన్ ఎస్ క్లినిక్ ముందు కుటుంబ సభ్యుల ధర్నా
- వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు చనిపోయాడని ఫిర్యాదు




**అక్టోబర్ 9,**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల క్రాంతి కాలనీలో విషాదం నెలకొంది. చెంగిచెర్లలోని ఎస్ఎల్ఎన్ఎస్ క్లినిక్ లో అందించిన చికిత్సపై అనుమానం వ్యక్తం చేస్తూ బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్లినిక్ లో గతంలో కూడా ఇలాంటి పలు ఘటనలు జరిగాయని, వైద్యుడు నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని కాలనీవాసులు ఆరోపిస్తూ హాస్పటల్ ముందు ధర్నా నిర్వహించారు. బాలుడి మృతికి కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాలుడు మృతికి కారణమైన వైద్యుని పై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.బోడుప్పల్లోని అరవింద్ ఎంక్లేవ్ లో నివసించే వంగపల్లి సత్యనారాయణ కుమారుడు వంగపల్లి అనురుషిక్ (14) ఈ నెల 7న అనారోగ్యానికి గురికావడంతో చెంగిచెర్లలోని ఎస్ఎల్ఎన్ఎస్ క్లినిక్లో సాయి కృష్ణ అనే వైద్యుడి వద్ద చికిత్స పొందాడు. మరుసటి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన అనంతరం బాలుడికి జ్వరం రావడంతో తల్లి తిరిగి అదే క్లినిక్కు తీసుకెళ్లింది. అక్కడ ఇంజెక్షన్, సెలైన్ ఇచ్చిన తర్వాత మెరుగైన చికిత్స కోసం మేడిపల్లిలోని మిరాకిల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బాలుడిని మిరాకిల్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సుమారు 50 నిమిషాల పాటు చికిత్స అందించారు. దాదాపు 30 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేసిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక, వైద్య రికార్డులు, పోలీసుల దర్యాప్తు ఆధారంగా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ముదిగొండ అస్తమయం...

**హైదరాబాద్ అక్టోబరు 9**

ప్రముఖ చారిత్రక నవలా రచయిత, 'చారిత్రక నవలా చక్రవర్తి'గా ఖ్యాతి గడించిన ముదిగొండ శివప్రసాద్ (86) కన్నుమూశారు. గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గురువారం రాత్రి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8:45 గంటల సమయంలో మరోసారి గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1940 డిసెంబర్ 23న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో జన్మించిన శివప్రసాద్, హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో ఆయన 80కి పైగా గ్రంథాలను రచించగా, వాటిలో 20కి పైగా చారిత్రక నవలలు ఉన్నాయి. కాకతీయ కళాదర్శనం, తంజావూరు విజయం, రెసిడెన్సీ, శ్రీలేఖ, ఆవాహన వంటి రచనలు తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందాయి. భారత చరిత్రను, సంస్కృతిని తన రచనల ద్వారా సామాన్య పాఠకులకు చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేశారు.ఆయనకు కుమారుడు ఇందుశేఖర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితమే మరణించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు శివం రోడ్డులోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో గల ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముదిగొండ శివప్రసాద్ మరణం తెలుగు చారిత్రక సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

### పట్టభద్రులందరూ నూతన

## ఓటు నమోదు చేసుకోవాలి

- నవంబర్ 06 లోపు ఓటును నమోదు చేసుకోండి
- పట్టభద్రులకు విజ్ఞప్తి చేసిన బిఆర్ఎస్ యువజన నాయకుడు ఉప్పరి విజయ్

**బోడుప్పల్, అక్టోబర్ 09 (పద్మక్రాంతి):**



అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ఉప్పరి విజయ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్నగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నుంచి ఇద్దరు శాసనమండలి సభ్యులను ఎన్నుకునే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాలకు 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు హక్కు ఉన్న పట్టభద్రులు సైతం మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేయాలని కోరారు. ఆన్లైన్, విధానాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఉప్పరి విజయ్ విజ్ఞప్తి చేశారు.

### మైలార్దేవుపల్లి ఎంపీపీస్ లో

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**పద్మక్రాంతి ఆక్టోబర్ 09, (రాజేంద్రనగర్ ప్రతినిధి):**

ఎంపీపీస్ రాజేంద్రనగర్ మైలార్దేవుపల్లి హరిజనవాడ ఎంపీపీస్ పాఠశాల లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.విద్యార్థులే స్వయంగా బతుకమ్మలను తయారుచేసి బతుకమ్మ పాటలు పెట్టుకొని బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.రాజేంద్రనగర్ మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ) అధ్యక్షులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ మదగని ఉపాధ్యాయులు విద్యార్థుకు బతుకమ్మ పండగ గురించి వివరించారు.విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుండి విద్యార్థుల చేరికల మీద ఆందోళనతో,ఉపాధ్యాయుల సర్దుబాటు మీద ఆందోళనతో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూ... పాఠశాల నిర్వహణలో బయోమెట్రిక్ వెరిఫికేషన్లు, ఆన్లైన్ అసైన్మెంట్లు మరియు విద్యా పోర్టళ్లలో డేటా ఎంట్రీలు డిజిటల్, ఆన్లైన్ బోధనేతర యాప్‌ల మోత ఉపాధ్యాయులు మోస్తున్నరన్నారు.ఉపాధ్యాయలు తన విద్యుక్త ధర్మమైన పేద పిల్లల చదువులకై విశ్రాంతి లేని విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులకు బాలక్రిష్ణ బతుకమ్మ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యార్థులంతా ఎంతో ఉత్సహంగా బతుకమ్మ సంబరాలు జరుపుకుని అనంతరం బతుకమ్మను పల్లెచెరువు లో నిమజ్జనం చేశారు.ఈ సంబరాలలో ఉపాధ్యాయురాలు రాధారాణి, శ్రావణి, సుజాత,అక్తర్ బేగం,తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య భారతిలో బతుకమ్మ సంబురాలు

### - పూల పండుగతో మార్మోగిన పాఠశాల





**మిడ్జిల్ అక్టోబర్ 9 పద్మ క్రాంతి**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులకు సెలవులు రానున్న నేపథ్యంలో మిడ్జిల్ మండల కేంద్రంలోని చైతన్య భారతి హై స్కూల్ లో గురువారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం పూల పండుగ శోభతో కళకళలాడింది. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కలిసి రంగురంగుల గునుగు, తంగేడు, బంతి పూలతో పెద్ద బొడ్డెమ్మను పేర్చి అందంగా బతుకమ్మలను తయారు చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు భావి తరాలకు తెలియాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం విద్యార్థులు వలయాకారంలో నిలబడి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో ఆడిపాడారు. చివరిగా అందరూ కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని సందడిగా జరుపుకున్నారు.

### నష్టపరిహారం తేల్చాకే..

# సర్వేలకు ఓకే

**రైల్వే విస్తరణపై భువనగిరి 1వ వార్డు బాధితుల స్పష్టత**

**తహసీల్దారుకు వినతిపత్రం అందజేత**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 9 (పద్మక్రాంతి) :**



రైల్వే ట్రాక్ విస్తరణ పేరుతో స్థానికుల నుంచి వివరాలు, సంతకాలు సేకరించడంపై భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డ్ అంబేద్కర్ నగర్, అర్బన్ కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నష్టపరిహారంపై స్పష్టత ఇచ్చే వరకు ఎలాంటి సర్వేలకు సహకరించబోమని తెగేసి చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం వారు భువనగిరి తహసీల్దారు జగన్మోహన్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రైల్వే ట్రాక్ విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్నారని చెబుతూ.. బాధితుల కుటుంబ వివరాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, ఎలక్షన్ కార్డ్ నంబర్లతో పాటు అధికారులు సంతకాలను సేకరించడం ఏమిటని ప్రశ్నించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం చెల్లిస్తారనే అంశంపై స్పష్టత ఇవ్వకుండా సర్వే నిర్వహించడం సరైనది కాదన్నారు. నష్టపరిహారం, పునరావాసంపై ప్రభుత్వం నుండి అధికారికంగా స్పష్టమైన ప్రకటన వచ్చేంతవరకు ఎలాంటి సర్వేలకు గానీ, సంతకాల సేకరణకు గానీ ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తాళ్లపల్లి చంద్రశేఖర్, మామిండ్ల కృష్ణ, కాస్పరాజు, బాలరాజు, మామిండ్ల పద్మరావు, తాళ్లపల్లి రామరాజు, తాళ్లపల్లి శివకుమార్, పృద్విరాజు, మామిండ్ల వేణు 1వ వార్డ్ అంబేద్కర్ నగర్, అర్బన్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### సుభ్య తాండాలో ఉచిత పశు వైద్య శిబిరం -

## 27 పాడి పశువులకు చికిత్స






**మిడ్జిల్ అక్టోబర్ 9 పద్మ క్రాంతి**

మిడ్జిల్ మండలం సుభ్య తాండ ఈద్దుల భాయ్ తాండ గ్రామంలో పశు వైద్య శాఖ మరియు తెలంగాణ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ కలిసి ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భసంచి వ్యాధుల నివారణ పరీక్షలు మరియు అవగాహన సదస్సులో భాగంగా 27 పాడి పశువులకు చికిత్సలు అందించారు. 17 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్, సర్పంచ్ ధర్మా నాయక్, ఉప సర్పంచ్ రవి నాయక్, గ్రామ పెద్దలు, పాడి రైతులు పాల్గొన్నారు. పశు వైద్య సిబ్బంది సత్యం, దామోదర్, సత్యం మరియు పశు మిత్రులు యాదగిరి, రామకృష్ణ, నర్సింలు, మల్లేష్, వేణుగోపాల్ చారీ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులను తట్టుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం, ప్రత్యేక వీర్యం ద్వారా ఆడ దూడలను పుట్టించడం, రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ, పశువులకు టీకాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల కొట్టాల నిర్మాణం గురించి రైతులకు అవగాహన కల్పించారు.

# అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా






- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- నార్సింగ్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా
- మెదక్- బోడమట్ పల్లి రహదారిపై ధర్నా,రాస్తారోకో

**పాపన్నపేట,అక్టోబర్09 (పద్మక్రాంతి)**

రైతాంగానికి అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం రోజు మెదక్ జిల్లా,పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి సబ్ స్టేషన్ వద్ద రైతులు అధికారులపై కన్నెర్ర చేశారు.మెదక్- బోడమట్ పల్లి రహదారిపై బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు దాదా రెండు గంటల పాటు ధర్నా,రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు.రైతులకు కరెంటు సమయాను కూలంగా ఇవ్వలేకపోవడం మూలంగా చేతికొచ్చిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు 24గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.విద్యుత్ ఏడిఈ వెంకటేశ్వర్లు,ఏఈ నర్సింలు వచ్చి రైతులకు సమాధానం చెప్పాలని ఎర్రటి ఎండలో రోడ్డుపై భీష్మించుకుని బైఠాయించారు.ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్,మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రెటరీ రంజిత్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్స్ లక్ష్మణ్,భరత్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్,రాష్ట్ర బీసీకార్యవర్గ సభ్యుడు గడ్డం కాశీనాథ్,జిల్లా నాయకులు దిశా మెంబర్ ఏంఎల్ఎన్ రెడ్డి, జిల్లా నాయకులు బిక్షపతి,జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీ శ్యామ్,ఆకుల ప్రభాకర్, చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు రాజు, హవేలీ ఘన్ పూర్ మండల అధ్యక్షుడు శ్రీను, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరిబాబు,చంద్రన్న జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బీకొండ రాములు,పాపన్నపేట మండల కన్వీనర్ నార్సింగ్ ఉప సర్పంచ్ శ్రీరామ్ నరేష్,ఆకుల సుధాకర్ పాపన్నపేట జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, వెంకట్,బుల్లెట్ మండల కార్యవర్గ సభ్యులు సాయిబాబా,మల్లేశం, కొంపల్లి లక్ష్మణ్,గోపాల్ పాపన్నపేట మండలం కిసాన్ మోర్చా అధ్యక్షులు సిద్ధిరాములు,పాపన్నపేట పట్టణ అధ్యక్షులు సుంకరికిష్టయ్య,మండల నాయకులు బైండ్ల దుర్గయ్య,శంకర్ గౌడ్ కుమార్,చంద్రశేఖర్ యువమోర్చా నాయకులు రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో దాదాపు 150 మంది రైతులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏడిఈ,ఏ ఈ లకు అందజేశారు.

# ఎమ్మెల్యే బీర్ల భూ అక్రమ దందాలపై విచారణ జరపాలి

**ఎక్సెస్ ల్యాండ్ పేరుతో డబుల్ రిజిస్ట్రేషన్ల దందా**

**4 వేలమందికి పైగా ప్లాట్ల కొనుగోలుదారులకు కుచ్చుటోపీ**

**రూ. 500 కోట్ల కుంభకోణంపై బహిరంగ చర్చకు సవాల్**

**పూర్తి ఆధారాలతో సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తా**

**సోషల్ మీడియాలో బొడుసు మహేష్ వీడియో వైరల్**

**రాజాపేట, అక్టోబర్ 9 (పద్మక్రాంతి) :**

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అక్రమ కంపెనీల రిజిస్ట్రేషన్లు చేసి భూ దందాలతో భారీ అక్రమాలకు పాల్పడ్డారని తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బొడుసు మహేష్ చేసిన తీవ్ర ఆరోపణలు నెట్టింట వైరల్ గా మారాయి. ఈ ఆరోపణలకు సంబంధించి సోషల్ మీడియా లో వైరల్ అయిన అంశంలో ఎమ్మెల్యే ఐలయ్య భూ అక్రమాలు అధికమయ్యాయని, అక్రమ లేఅవుట్ అనుమతులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేసిన విజువల్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి.

### ఒకే సర్వే నంబర్‌లో నాలుగు కంపెనీలు

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని ఒకే సర్వే నంబర్ 322/4 లో నాలుగు వేర్వేరు కంపెనీలను ఏ ఉద్దేశంతో నెలకొల్పారో సమాధానం చెప్పాలని, ఆర్ఓసీ లో నమోదైన ఎస్వైఎన్ఎల్ఎస్ ఆగ్రో డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి బీర్ల ఐలయ్య, ఈరసారపు యాదగిరి గౌడ్‌లు డైరెక్టర్లుగా ఉండటంతోనే అనుమానాలు బలపడుతున్నట్లు వీడియో సందేశంలో తెలిపారు. అంతేకాకుండా.. ఎస్ఎల్ఎన్ఎస్ ఆగ్రో డెవలపర్స్, వెన్నెల ఇన్ఫ్రాస్ట్రక్చర్, శ్రీసాయి డెవలపర్స్ అనే సంస్థల్లో బీర్ల ఐలయ్యతో పాటు చీర శ్రీశైలం, ఈరసారపు యాదగిరి గౌడ్, బీర్ల శంకర్‌లు భాగస్వాములుగా ఉన్నారని, వీటన్నింటినీ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో నమోదు చేశారని వెల్లడించారు.

### ఎక్సెస్ ల్యాండ్.. డబుల్ రిజిస్ట్రేషన్ల మోసం




చల్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 322/4 లో 2002-03 సంవత్సరం రెవెన్యూ రికార్డుల ప్రకారం సుమారు 908 ఎకరాలు ఉన్న భూమి, 2025-26 సంవత్సరం వరకు 1570 ఎకరాలకు చేరుకుందని వివరించారు. ఆ సర్వే నంబర్ లో వందల ఎకరాల భూములు ఉండటం కొనుగోలు సమయంలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని ఆరోపించారు. 1 ఎకరం స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో మరో 5 నుండి 10 ఎకరాల భూమిని అదనంగా (ఎక్సెస్ ల్యాండ్) కలిపి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు..

### టీఎల్పీ నంబర్ 108/2021 పేరుతో భారీ మోసం

ఎస్వైఎన్ఎల్ఎస్ ఆగ్రో డెవలపర్స్ పేరున చల్లూరు సర్వే నంబర్లు 322/4, 220 లలో వెంచర్ ఏర్పాటు కొరకు 115 ఎకరాల విస్తీర్ణానికి టీఎల్పీ నంబర్ 108/2021 తో డీటీసీపీ అనుమతి తీసుకుని 1,162 ప్లాట్లను అభివృధి చేస్తున్నట్లు చూపారని తెలిపారు. అదేవిధంగా ఎస్ఎల్ఎన్ఎస్ డెవలపర్స్ పేరుతో మరో 64 ఎకరాల విస్తీర్ణంలో టీఎల్పీ నంబర్ 333/2021 తో 618 ప్లాట్ల అభివృద్ధికి అనుమతి పొందినట్లు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో 1,780 ప్లాట్లకు, ఒక్కో ప్లాటును ఇద్దరు ముగ్గురికి విక్రయించి దాదాపు 4,000 మంది కొనుగోలుదారులను దారుణంగా మోసగించిన ఆధారాలు త్వరలోనే బహిర్గతం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అక్రమాల ద్వారా బీర్ల అయిలయ్య సుమారు రూ. 500 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు.

### జీపీ 10 శాతం స్థలాల విక్రయాల ఆరోపణలు

వెంచర్ల అభివృద్ధి నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం, 15 శాతం మార్టిగేజ్ ప్లాట్లతో పాటు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి కనీస మౌలిక సదుపాయాలకు కేటాయించిన స్థలాలను కూడా అక్రమంగా విక్రయించేశారని మహేష్ ఆరోపించారు. బీర్ల ఫౌండేషన్ పేరిట ప్రజలకు కొద్దిపాటి సాయం చేస్తూ, వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ రియల్ ఎస్టేట్ అక్రమాలు, లేఅవుట్ దందాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీర్ల ఐలయ్య చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ విషయంలో పూర్తి ఆధారాలతో త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తానని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఈ భూ దందాల అయిలయ్య కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.




ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పై సోషల్ మీడియా లో వైరల్ అవుతున్న వీడియో

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## యూపీఎస్ చిల్వేర్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



మిడ్జిల్ అక్టోబర్ 9 పద్మ క్రాంతి

మిడ్జిల్ మండలం చిల్వేర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ సెలవులకు ముందు విద్యార్థులకు పండుగ ప్రాధాన్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రంగురంగుల పూలతో బొడ్డెమ్మను పేర్చి బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం విద్యార్థులు ఆడపిల్లలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు జరిగాయి. చివరిగా బతుకమ్మ నిమజ్జనం చేసి పండుగను ముగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్టీ మోర్చా జిల్లా టీం పాఠశాలల సందర్శన

జామలపల్లి, అక్టోబర్ 09 ( పద్మక్రాంతి):





మహబూబాబాద్ జిల్లా జామలపల్లిలోని విద్యా భారతి స్కూల్ మరియు పక్కనే ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ స్కూల్‌ను ఎస్టీ మోర్చా జిల్లా టీం సందర్శించింది.
ఈ సందర్భంగా పాఠశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి, పాఠశాలల్లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాల నాణ్యత, భోజన సదుపాయాలు మరియు ఇతర వసతుల గురించి వివరాలు తెలుసుకున్నారు.
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా సంబంధిత సమస్యలను పరిశీలించడం ఈ సందర్శన ప్రధాన ఉద్దేశమని తెలిపారు.
విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం - వారి సమస్యల పరిష్కారమే మా ధ్యేయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు కోసం బీఆర్ఎస్ సమన్వయ సమావేశం

- పీర్జాదిగూడ, మేడిపల్లిలో 18 కేంద్రాల ఏర్పాటు
- పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- - మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి






మేడిపల్లి, అక్టోబర్ 09 (పద్మక్రాంతి):

హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై చర్చించారు. సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, ఇప్పటికే రెండు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటికి అదనంగా మరో 18 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తూ, నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్యకర్తలకు జక్క వెంకట్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యువజన అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్‌తో పాటు వివిధ డివిజన్ల మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 20వ శతాబ్దపు విప్లవ కెరటం “ఎర్నెస్టో చేగువేరా “

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా 59వ వర్ధంతి
- “చే” స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కులకోసం ఉద్యమించాలి
- - ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి. హరీష్, ఎండీ అన్వర్

మేడిపల్లి, అక్టోబర్ 09 (పద్మక్రాంతి):




ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ , ఎండీ అన్వర్ మాట్లాడుతూ చేగువేరా పేరు వింటేనే నరనరాల్లో చైతన్యం ప్రవహిస్తుంది. ఎర్నెస్టో చే గువేరా 1928 జూన్ 14 న అర్జెంటీనా దేశంలో రోసారియా పట్టణంలో జన్మించి బ్యూనాస్ ఎయిర్స్ యూనివర్సిటీలో మెడిసిన్ పూర్తి చేసిన అనతి కాలంలోనే లాటిన్ అమెరికా తిరిగి అక్కడున్న ప్రజలందరి బ్రతుకులు మార్చడం కోసం ఏ మెడిసిన్ ఇవ్వగలం అని మదనపడుతున్న తరుణంలో 1955 మెక్సికో క్యూబా ప్రవాస విప్లవకారుడు ఫెడల్ కాస్ట్రోతో పరిచయం ఏర్పడింది. క్యూబా విప్లవంలో డాక్టర్ గా చేరాడు. దోపిడీకి గురవుతున్న ప్రజలకు విప్లవాత్మక మెడిసిన్ అవసరమని భావించి విప్లవకారుడిగా పరిణితి చెంది విప్లవ గెరిల్లా దళానికి నాయకుడయ్యాడు. క్యూబా స్వాతంత్ర్యం కోసం ఆస్థమా వ్యాధిని సైతం లెక్క చేయకుండా చే నిజమైన గెరిల్లా నాయకుడయ్యాడు. 1959 లో ఆవిష్కృతమైన స్వాతంత్ర్య క్యూబాలో చేగువేరా పరిశ్రమల మంత్రిగా, జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా,రక్షణ కేంద్రాల అధిపతిగా, ఆర్థిక, మైత్రి బృందాల సభ్యులుగా ఎన్నో బాధ్యతలను తన 39 ఏండ్ల ప్రాయంలోనే నిర్వహించాడు. బొలివియా ప్రజలను విముక్తి చేసే బాధ్యతని తన భుజాలపై వేసుకొని “కమ్యూనిస్ట్ గెరిల్లా దళాన్ని” స్వయంగా తయారు చేసుకుని విప్లవోద్యమాన్ని నిర్మించి నాయకత్వం వహించాడు. ఆయన పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత, విద్యా, ఉపాధి, ఆర్థిక, సామజిక అసమానతలపై పోరాటాలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వెంకటేష్, సన్నీ, సిద్ధార్థ, వినయ్,చరణ్, ప్రవీణ్, మహేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న గొడవకే స్టేషన్ బాట

## తెగిపోతున్న బంధాలు

## ఊరి పెద్దల మాటకు విలువేదీ?

మిడ్జిల్, అక్టోబర్ 09(పద్మ క్రాంతి

ఒకప్పుడుగ్రామంలో చిన్నపాటి గొడవ వస్తే ఊరి పెద్దలు కూర్చొని పరిష్కరించేవారు. ఇరువర్గాలను పిలిచి నాలుగు మాటలు చెప్పి, బంధాలను కాపాడేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. చిన్న మాటపట్టింపే పెద్ద వివాదంగా మారుతోంది. చిన్న గొడవ కూడా నేరుగా పోలీస్ స్టేషన్ వరకు వెళ్తోంది. ఫిర్యాదులు, కేసులు, ప్రతీకారాలతో చివరకు కుటుంబాల మధ్య శాశ్వత దూరాలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామాల్లో పొలం దారి, నీటి విషయం, ఇంటి స్థలం, కుటుంబ గొడవ, పిల్లల మధ్య తగాదా వంటి సమస్యలు సహజం. ఇలాంటి వివాదాలను మొదట కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. ప్రతి చిన్న వివాదానికీ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాకుండా ఇరువర్గాల మధ్య మనస్పర్థలు మరింత పెరుగుతున్నాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఇద్దరి మధ్య చిన్న గొడవ రెండు కుటుంబాల మధ్య వివాదంగా మారుతోంది. బంధువులు రెండు వర్గాలుగా విడిపోతున్నారు. పెళ్లిళ్లకు పిలుపులు ఉండటం లేదు, ఒకే వీధిలో ఉంటూ పలకరించుకోని పరిస్థితులు వస్తున్నాయి. నిన్నటి వరకు అన్నదమ్ముల్లా ఉన్న కుటుంబాలు నేడు ప్రత్యర్థులుగా మారుతున్నాయి. ఒకప్పుడు కష్టంలో పది మంది అండగా నిలిచేవారు, పండుగ అంటే ఊరంతా ఒక కుటుంబంలా జరుపుకునేవారు. ఆ సామాజిక అనుబంధాలు ఇప్పుడు దెబ్బతింటున్నాయి. తీవ్రమైన నేరాలు, హింస, మహిళలు-పిల్లలపై దాడులు వంటి విషయాల్లో పోలీసులను ఆశ్రయించడం అవసరమే కానీ, చిన్నపాటి మనస్పర్థలకు సామరస్య పరిష్కారం వెతకాలి. గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు కలిసి పనిచేస్తే చిన్న సమస్యలు పెద్ద వివాదాలుగా మారకుండా అడ్డుకోవచ్చు. ఒక ఫిర్యాదు




చేయడానికి నిమిషం, ఒక కేసు పెట్టడానికి గంట పడుతుంది. కానీ ఒక బంధాన్ని తిరిగి కలపడానికి సంవత్సరాలు పడుతుంది. అందుకే ఆవేశంలో నిర్ణయాలు తీసుకోకుండా సమస్యను మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. గ్రామం అంటే కేవలం ఇళ్లు కాదు, మనుషుల మధ్య బంధం. ఆ బంధం తెగిపోతే అభివృద్ధి ఉన్నా ఆ గ్రామానికి ఆత్మ ఉండదు.

# పేదల ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు వరం

- రాఘవ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం
- ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభంలో..
- మునిసిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్
- 250 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు.. 50 మందికి ఆసుపత్రిలో ఉచిత చికిత్స

ఆలేరు, అక్టోబర్ 9 (పద్మక్రాంతి) :





పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతగానో ప్రయోజనకరమని ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్ అన్నారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ , మెడిసిటి హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆలేరులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్య బృందం మొత్తం 250 మందికి పైగా రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెరుగైన వైద్యం అవసరమని గుర్తించిన 50 మంది రోగులను తదుపరి ఉచిత చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**ప్రజారోగ్యమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు**

రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ.. ప్రజలకు వైద్య సహాయం అందించాలనే సంకల్పంతోనే ఈ శిబిరాన్ని తలపెట్టామని, భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. శిబిరానికి సహకరించిన రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు చక్రవర్తి రెడ్డి, మెడిసిటి హాస్పటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడిసిటి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, కౌన్సిలర్లు బొట్ల సంపత్, జెట్ట నీరజ సిద్దులు, మల్లెల సరిత శ్రీకాంత్, జుకంటి సంపత్, మరియమ్మ మార్క్, మాస్కోదు సముద్రాల శ్రీనివాస్, వడ్డెమాను నరేందర్, కంతుల శంకర్, ఎగ్గిడి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి







మహబూబాబాద్, అక్టోబర్ 9, ( పద్మక్రాంతి):

విద్యార్థులు పోటీ ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలంటే చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలుగు అకాడమీ డైరెక్టర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ విద్యాసంస్థ నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై. కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన పట్టణంలోని ఆర్తి గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నిర్దేశించుకునే లక్ష్యాలే భవిష్యత్తుకు పునాది అని,విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన మహబూబాబాద్ డీఎస్పీ ఎన్. తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో విద్యనభ్యసించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. అనంతరం కరస్పాండెంట్ డోలు సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్యం లేని చదువు మన జీవితానికి ఉపయోగపడదని, ప్రతి విద్యార్థిని విద్యార్థి కష్టపడి చదవాలని కోరారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మైస శ్రీనివాస్, లక్ష్మణ్, డోలి లింగబాబు, పిల్లి సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ శంకర్, జూనియర్ ప్రిన్సిపల్ శ్రీపాల్ రెడ్డి, అధ్యాపకులు ప్రసాద్, రమేష్, రవిశంకర్, రాజు, ప్రసాద్, శేఖర్, కే ప్రసాద్, ఉప్పలయ్య, రవి, కుమార్, కిషన్, ముత్తయ్య, నరేష్, రేణుక, పూజిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# బేతోలులో ఘనంగా గ్యార్మి షరీఫ్ – 13వ కందిల్ ఉర్సు ఉత్సవాలు

**మహబూబాబాద్, అక్టోబర్ 09 ( పద్మక్రాంతి):**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో గ్యార్మి షరీఫ్ (జెండా పండుగ) వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి.

గ్రామస్థులు, ముస్లిం సోదరులు గ్యార్మి జెండాలను చేతబూని, డీజే పాటలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని ఉర్సు గుట్టపై హజ్రత్ మహబూబ్ సుభాని దర్గాలో మరియు ఖబ్రస్తాన్ లో ఉన్న ఖాదర్ బాబా దర్గా వద్దకు చేరుకుని గ్యార్మి జెండాలను ప్రతిష్ఠించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు (ఫాతిహా) నిర్వహించారు.



13వ ఖందిల్ ఉర్సు ఉత్సవాలు

హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 13వ ఉర్సు సందర్భంగా ఖందిల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 9:30 గంటలకు స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నుండి 13వ చాదర్, సందల్, కందిల్ జెండాల ఊరేగింపును వైభవంగా చేపట్టారు. డప్పు చప్పుళ్లు, డీజే హోరులో భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఉర్సు గుట్టపైకి చేరుకున్నారు. అక్కడ మహబూబ్ సుభాని దర్గా వద్ద చాదర్, సందల్, కందిల్ జెండాలను ప్రతిష్టించారు.

**నేడు (శనివారం) ప్రత్యేక ప్రార్థనలు - మొక్కల చెల్లింపు**

ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉర్సు గుట్టపై ఉన్న హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా వద్ద ముస్లింలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు (ఫాతిహా) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాటపోతులు, కందులు సమర్పించి తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు.

ఉర్సు సందర్భంగా నేడు భారీ అన్నదానం

ఉర్సును పురస్కరించుకుని గౌసియా పాక్ దర్గా జెండా గద్ద వద్ద 13వ చాదర్, సందల్, ఖందిల్ జెండాలకు ఫాతిహా నిర్వహించిన అనంతరం, గ్రామ ప్రభుత్వ పాఠశాల వద్ద భక్తులందరికీ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ వేడుకల్లో గ్రామ మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ముజావర్లు, ఖాందిల్ కమిటీ సభ్యులు, భక్తులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటి గుంతలో పడి బాలుడి దుర్మరణం...

- తల్లిదండ్రుల కళ్లెదుటే విషాదం..

**పద్మక్రాంతి,అక్టోబర్ 09,( కల్వకుర్తి ప్రతినిధి ):**



నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పొలంలోని నీటి నిల్వ గుంతలో పడి ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు.

గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొట్ర గ్రామానికి చెందిన ఉప్పనమోని శివ, పూజిత దంపతులు సోమవారం తమ పొలంలో పత్తి ఏరుతున్నారు. వారి ఒక్కగానొక్క కుమారుడు కౌశిక్ (2) పొలంలోనే ఆడుకుంటున్నాడు. ఆడుకుంటున్న కుమారుడు కాసేపటికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికారు. పొలంలో ఉన్న నీటి నిల్వ గుంతలో చూడగా చిన్నారి విగతజీవిగా పడి ఉన్నాడు. ఒక్కగానొక్క కొడుకు తమ కళ్లెదుటే మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వారి రోదన చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలి
- పరిశీలనలో.. ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 9 (పద్మక్రాంతి) :**

అక్టోబర్ 21న నిర్వహించనున్న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం సైదాపూర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి, సంస్మరణ దినోత్సవానికి సంబంధించి చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజ రక్షణకై ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకునే ఈ వేడుకను ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత క్రమశిక్షణతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో ప్రధాన వేదిక ఏర్పాటు, సీటింగ్ ప్రాంగణం, మైక్ సిస్టమ్, విజిటర్స్ గ్యాలరీతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని, పక్కా బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఇతర ముఖ్యులతో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వినోద్, డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐ భాస్కర్, ఆర్ఐ లతీఫుద్దీన్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# మిడ్జిల్‌లో ఘనంగా గ్యారీవి షరీఫ్ వేడుకలు

- మహబూబ్ సుబ్హాని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- భక్తిశ్రద్ధల నడుమ గంధం, చాదర్ ఊరేగింపు

**మిడ్జిల్ అక్టోబర్ 9 ( పద్మ క్రాంతి**

మిడ్జిల్ మండల కేంద్రంలో గ్యారీవి షరీఫ్ వేడుకలను శుక్రవారం సాయంత్రం స్థానిక మహబూబ్ సుబ్హాని దర్గా వద్ద గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా నిద్దవెల్లి అంజయ్య, లాలూ ముదిరాజ్‌ల గృహాల నుండి ప్రారంభమైన గంధం, జెండా, చాదర్ సమర్పణ ఊరేగింపు గ్రామంలో కోలాహలంగా సాగింది.

ఈ ఊరేగింపును లాలు ముదిరాజ్, తిరుపతి ముదిరాజ్, జగదీష్ ముదిరాజ్, కృష్ణగౌడ శ్రీశైలం ముదిరాజ్, మల్లేష్ యాదవ్ దగ్గరుండి ఘనంగా నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించారు. హిందూ-ముస్లింల సోదరభావానికి, సమైక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయని నిర్వాహకులు తెలిపారు.





**ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ వ్యాపారవేత్త మహబూబ్**

ఈ వేడుకల్లో ప్రముఖ వ్యాపారవేత్త మహబూబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన కార్యక్రమంలో పాల్గొని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, గ్రామస్థులు ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల శంకర్, ఉపసర్పంచ్ మమతా మన్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ గౌస్, వార్డు మెంబర్లు కోట్ల పర్వతాలు, కుర్మయ్య, రమేష్, వెంకటయ్య, సరిత కృష్ణ, భారతి హరి గౌడ్ లతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు, మహిళలు, మీడియా ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.